క్లుప్తంగా

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో



సంపద తయారీ కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్.శిరీషారాణి ఆదేశించారు. వెన్నలపాలెంలోని సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ప్రతి శనివారం గృహ వాసుల నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తప్పనిసరిగా చేర్చాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డీపీవో వెంట పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

భర్నికంలో సీసీ రోడ్లు ప్రారంభం



భర్నికంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలంలోని భర్నికంలో రూ.28 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజాశేఖర్, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, ఎంపీడీవో వి.ధర్మారావు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, నాయకులు కన్నూరి వెంకటరమణ, వియ్యపు చిన్న, బొండా సన్నిదేముడు, పెదిశెట్టి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అడవివరం గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సింహాచలం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సింహాచలం వాకర్స్ క్లబ్ యోగ సాధకుడు కె.సన్యాసిరావు విద్యార్థులకు సూచించారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు యోగా విశిష్టతని తెలిపారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, యోగా చేయడం ద్వారా అనేక రుగ్మతలను తొలగించుకోవచ్చన్నారు. విశ్రాంత హెచ్ఎం పాలెపు బంగారుచిట్టి మాస్టారు మానవుని శరీర అవయవాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో మ్యూజికల్‌చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, విశ్రాంత హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి, న్యాయవాది రామకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది ఎల్లమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

చోరీలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సబ్బవరం సీఐ జి.రామచంద్రరావు



సబ్బవరం: దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో నివసించేవారు వేసవి సెలవుల్లో బయటి ప్రాంతాలకు వెళితే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఎక్కువ రోజులు బయట గడిపేందుకు వెళ్లేవారు ముందుగా తమకు తెలియజేస్తే ప్రత్యేక సీసీ కెమెరా వ్యవస్థ ఏర్పాటుతోపాటు, పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ఉండే షాపులు, దుకాణాలు, విద్యా సంస్థలు, ఇళ్ల యజమానులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా.. వెయ్యి మంది పోలీసుల విధులకు సమానమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్‌లు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు తప్పక ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని కోరారు. వాట్సప్‌కు గుర్తు తెలియని నెంబర్ల నుంచి లింకులు వస్తే క్లిక్ చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గిఫ్ట్‌లు, ఉద్యోగాలు అని వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని హెచ్చరించారు.

వేసవిలో లభించే సీజనల్ పండ్ల జాతిలో పనస ప్రత్యేకతే వేరు. అందులోనూ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన సింహగిరి కొండల్లో పండే పనసది మరింత ప్రత్యేకత. తియ్యదనంలో ఇక్కడి పనసకు మరే పనసా సాటి రాదని ఒక్కసారి తిన్నవారెవరైనా.. నోరూరేలా చెప్తారు. సింహగిరి పనసను ఇష్టపడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. సీజన్ మొదలవడంతో సింహాచలం రోడ్లకు ఇరువైపులా పనస పండ్లు నోరూరిస్తున్నాయి.



పనసపండ్లు

సింహగిరి పనస వచ్చేసిందోచ్!

- నోరూరించే కజ్జా పనసకు కేరాఫ్ సింహగిరి
- ఇక్కడి కొండల్లో పండిన పనస తియ్యదనంలో మేటి
- మే నుంచి జూలై వరకు పనసపండ్ల జాతర



పనస తొనలు కోస్తున్న మహిళ రైతు

సింహాచలం: ఏటా మే నుంచి జూలై వరకు సింహాచలంలో పనసపండ్ల సందడి నెలకొంటుంది. సింహాచలంలోని కొండదిగువ బస్టాండ్, మార్కెట్, ఘాట్ రోడ్డు, కాపుదిబ్బ, పాత అడవివరం, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ తదితర ప్రదేశాల్లో పనస పండ్లు కనువిందు చేస్తుంటాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు తియ్యని పనస తొనలను రుచిచూడటమే కాకుండా, తమ కుటుంబ సభ్యుల మేరకు చిన్నా, పెద్ద పండ్లను కొనుగోలు చేసి, తీసుకెళ్తుంటారు. విశాఖ నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పనిగట్టుకుని మరీ వచ్చి, ఇక్కడి పనస పండ్లను కొనుగోలు చేస్తుంటారంటే.. ఆశ్చర్యపోనక్కర్లేదు.

కజ్జా పనస.. తియ్యదనమే వేరు

సింహగిరి ఫలసాయం తోటల్లో పండే పనసలోని తియ్యదనమే వేరని.. ఇక్కడి పనస తొనల్ని తినేవారు ఆనందంగా చెప్తుంటారు. ముఖ్యంగా ఇక్కడ పండే కజ్జా పనస తియ్యదనం అద్భుతమని కొనియాడుతుంటారు. సింహగిరి కజ్జా పనస రుచి మరెక్కడా ఉండదని చెప్తుంటారు. ఏటా ఈ రకం పనస ఎప్పుడెప్పుడు వస్తుందా.. అని కొనుగోలుదారులు ఎదురుచూస్తుంటారు. సింహగిరి కొండల్లో ఉన్న పెదలోవ, సిరిముల్లోవ, బగాదిలోవ, జీలుగులోవ, తిరగల్లోవ, బడ్డేటిలోవ, కోడిపెట్లలోవ, దుమ్ములలోవ, పూలతోట తదితర ప్రాంతాల్లో పనస విరివిగా కాస్తుంది.



తోటల్లో చెట్లకు కాసిన పనస

కొండలు, కోనల్లోకి వెళ్లి..

అటవీ ప్రాంతాన్ని తలపించే సింహగిరి కొండల్లోని ఫలసాయం తోటల్లోకి చొచ్చుకొని వెళ్లి, రైతులు పనస సాగు చేస్తుంటారు. ఉదయం కొండల్లోకి వెళ్లి, సాయంత్రానికి తిరిగి వస్తుంటారు. ఎంతో కష్టపడి పనస పండ్లను కోస్తారు. కోసిన పనసను భుజాలపై పెట్టుకుని తుప్పలు, రాళ్లను దాటుకుని చెమటోడ్చి కొండదిగువకు తీసుకొస్తారు. తీసుకొచ్చిన పనసను కొందరు రైతులు స్వయంగా విక్రయిస్తుంటారు. కొందరు చిల్లర వ్యాపారులు కొండల్లోకి వెళ్లి రైతుల వద్ద పనసపండ్లు కొనుగోలు చేస్తుంటారు. పనస తొనలను ఒలిచి, విక్రయాలు జరుపుతారు. చాలా వరకు కుటుంబమంతా ఈ సీజన్లో వీటిపైనే ఆధారపడి, కష్టపడతారు. పండు సైజ్ మేరకు ఈ ఏడాది రూ.100 నుంచి రూ.300ల వరకు పనస పండ్లను విక్రయిస్తున్నారు.



సింహగిరి ఫలసాయం తోటల్లో చెట్లకు కాసిన పనస

నష్టాలు వచ్చినా ఆశ వీడరు

సింహాచంలోని పలువురు రైతులు సింహగిరి ఫలసాయం తోటలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఒక్కో ఏడాది పనస దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. పూర్తిగా వర్షాధారంపైనే ఆధార పడ్డ పనస వ్యాపారంలో కొన్నిసార్లు రైతులు నష్టాలు భరించక తప్పదు. వర్షాలు కురవని రోజుల్లో పనస దిగుబడి పెద్దగా ఉండదు. అరకొరగా దిగుబడి వచ్చినా రుచిలో తేడా ఉంటుంది. అందుకే వర్షాలు పుష్కలంగా ఉంటేనే తమ బతుకులు కూడా బాగుంటాయని సాగు రైతులు చెప్తుంటారు.

రుచి ఎంతో అద్భుతం



సింహగిరి కొండల్లో పండే పనస రుచి అద్భుతంగా ఉంటుంది. నాకు సింహగిరి ఫలసాయం తోటల్లో పనస చెట్లు ఉన్నాయి. వయస్సు రీత్యా నేను కొండల్లోకి వెళ్లలేను. మనుషుల్ని పెట్టి వాళ్లతో కొండదిగువకి పండ్లను తెప్పిస్తాం. ఇక్కడ టోకు, చిల్లర విక్రయాలు జరుపుతా.

– ఎర్ర బుచ్చిబాబు, అడవివరం

ఒక్కో ఏడాది ఆదాయం అంతంత మాత్రమే..



మేము కొండల్లోంచి పనస పండ్లను కొండ దిగువకి తీసుకొస్తాం. సొంతంగా విక్రయాలు జరుపుతాం. హోల్‌సేల్‌గా కూడా అమ్ముతాం. పనస దిగుబడి ఒక్కో ఏడాది ఒక్కోలా ఉంటుంది. ఒక్కోసారి నష్టాలు తప్పవు. సింహగిరి పనసకి ఉన్న రుచి మరెక్కడా ఉండదు.

– వరలక్ష్మి, అడవివరం

వర్షాలు బాగా పడితేనే



వర్షాలు బాగా పడితేనే పనస దిగుబడి బాగుంటుంది. శ్రమకు తగ్గ ఫలితం కూడా లభిస్తుంది. పనస పండ్లను కోసి తెచ్చేందుకు కొండల్లోకి వెళ్లే కూలీలకు ఇచ్చే కూలి రేట్లు అధికంగా పెరిగాయి. అయినా ఆ సింహాద్రి అప్పన్నపై భారం వేసి విక్రయాలు జరుపుతుంటాం.

– రమణమ్మ, అడవివరం



పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

- సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమ సోదాలు దారుణం
- పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డ పాత్రికేయ సంఘాలు
- పెందుర్తి తహసీల్దార్, సబ్బవరం డిప్యూటీ తహసీల్దార్లకు వినతిపత్రాలు



పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు



సబ్బవరం డిప్యూటీ తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని బయట పెడుతున్న సాక్షిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని పెందుర్తిలోని పలువురు సీనియర్ పాత్రికేయులు మండిపడ్డారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు అక్రమంగా సోదాలు నిర్వహించడం దుర్మార్గమని ఖండించారు. ఈ ఘటనపై పెందుర్తిలో పాత్రికేయ సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ధనుంజయరెడ్డి ఇంట్లోకి చొరబడి సోదాలు నిర్వహించడం, దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించడమే అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటి ఇలాంటి దుశ్చర్యలు భవిష్యత్‌లో మీడియా రంగంపై జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి పెందుర్తి ఆర్‌సీ ఎస్.భాస్కర్, సీనియర్ పాత్రికేయులు వెంకట్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంట్లో పోలీస్‌లు అక్రమంగా నిర్వహించిన సోదాలను మండలంలోని పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అప్పారావుకు మండల విలేకర్ల సంఘం తరఫున గురువారం సాయంత్రం వినతి పత్రం అందించారు. భావప్రకటన స్వేచ్ఛపై దాడులు అమానుషమని సీనియర్ పాత్రికేయుడు పి.మాణిక్యాలరావు ఆక్షేపించారు. ఇది పూర్తిగా పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలకు ఏ ప్రభుత్వం పాల్పడినా అది కక్ష సాధింపు చర్యల కిందికే వస్తాయన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీనియర్ పాత్రికేయులు బాజ్జి, సబ్బవరపు నాగేంద్ర, వి.శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, జక్కాన శ్రీనివాసరావు, ఆరిపాక ప్రసాదరావు, గండి అప్పలనాయుడు, శరగడం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రాహ్మణి ముత్యమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల, నాయకులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యమాంబ పండగను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచే తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, నాయకులు బండారు అప్పలనాయుడు, పైల రామచంద్రరావు, కన్నూరి వెంకటరమణ, అట్టా సన్యాసప్పారావు, వియ్యపు చిన్న తదితరులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, భజనలు, నేల డ్యాన్సుల నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భారీ బాణసంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్మిక సమ్మె విజయవంతానికి పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

పరవాడ: కార్మిక సమస్యలపై ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. లంకెలపాలెం కూడలిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, కార్మిక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను విరమించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి, వాటిని అమలు చేసే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, ముఠా యూనియన్ నాయకుడు దాసరి దేముడు, శ్రీను పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న గొర్లి రాజేష్

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో నూతనంగా చేపట్టనున్న పైడితల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గాలిభీమరం సర్పంచ్ గొర్లి రాజేష్ రూ.లక్షా 50 వేలు విరాళం అందించారు. నిర్మాణంలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు ఇచ్చారు. రాజేష్‌కు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు పాలిశెట్టి సురేష్‌రాజ్, అండిబోయిన కోటిరాజు, రెడ్డి శ్రీను, పిల్లి మణికంఠ తదితరులు ఉన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వేడుకగా.. శ్రీవారి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి



ఆకట్టుకున్న పులి వేషధారులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం స్వామివారు వేంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో రథంపై విహరిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు కనువిందు చేశారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపు అత్యంత సందడిగా సాగింది. మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజు శుక్రవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. ఆలయ అర్చకుడు మహర్తి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవంలో ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ



బంగారమ్మ సన్నిధిలో గండి రవికుమార్, తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ పండగ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పార్టీ నేతలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని సిరపరపు వారి కళ్లాలు యువత సుమారు 2 వేలు మంది భక్తులకు పులిహోర ప్రసాదం, మజ్జిగ, ఐస్‌క్రీమ్‌లు పంపిణీ చేసింది. అమ్మవారిని దర్శించుకున్నవారిలో యడ్ల నాయుడు, ఐడిబాబు, గండి ముత్యాలనాయుడు, నాయుడు, దేముడు, కరక రాము, గురి శ్రీనివాస్, సిరపరపు కుమార్, నవీన్, వసంతకుమార్, చైతన్య, దిలీప్, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.